సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శుక్రవారం
18-04-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు



బెంగళూరు VS పంజాబ్
బెంగళూరు, రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| ఢిల్లీ | 6 | 5 | 1 | 10 |
| గుజరాత్ | 6 | 4 | 2 | 8 |
| ఆర్సీబీ | 6 | 4 | 2 | 8 |
| పంజాబ్ | 6 | 4 | 2 | 8 |
| లక్నో | 7 | 4 | 3 | 8 |
| కొల్‌కత్తా | 6 | 2 | 4 | 4 |
| ముంబై | 7 | 3 | 4 | 6 |
| రాజస్తాన్ | 7 | 2 | 3 | 4 |
| సన్‌రైజర్స్ | 7 | 2 | 5 | 4 |
| చెన్నై | 7 | 2 | 5 | 4 |


ఆరెంజ్ క్యాప్ 357 ఐపీఎల్ అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్ 12 ఐపీఎల్ అత్యధిక వికెట్స్

## చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు
# మత స్వేచ్ఛలకు విఘాతం కల్పిస్తున్నారు

దేశ లౌకిక వ్యవస్థకు భంగం కలిగిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా చేసిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా లోక్‌సభలో ఓటు వేసిన ఎంపీ అవినాష్‌రెడ్డిని ముస్లిం మైనారిటీలు సత్కరించారు. గురువారం పులివెందులలోని తన నివాసం వద్ద ముస్లిం మైనారిటీ నేతలు ఎంపీని కలిసి దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లుకు తమ స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ, తెలుగుదేశం, జనసేనలు మద్దతు పలికి మత విద్వేషాలను రగిలించి ప్రయోజనం పొందాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఈ చట్టాన్ని సమర్థించడం ద్వారా చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు ముస్లీంల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు. రాజ్యాంగంలోని వ్యక్తిగత, మతపరమైన స్వేచ్ఛలకు విఘాతం కలిగించేలా, న్యాయస్థానాల తీర్పులకు భిన్నంగా వక్ఫ్ సవరణ చట్టంను కేంద్రం చేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం చేసిన రాజ్యాంగ విరుద్ధమైన బిల్లును పార్లమెంట్ ఉభయసభల్లోనూ వైయస్‌ఆర్‌సీపీ వ్యతిరేకించడంతో పాటు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం ముస్లింలకు ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. ముస్లింలకు అండగా నిలిచిన వైయస్ జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.







## తెలుగు విడుదల కోసం సిద్ధంగా ఉన్న
# 'అలప్పుజా జింఖానా'

ప్రేమలు చిత్రంతో తెలుగు ప్రేక్షకులలో ప్రజాదరణ పొందిన తరువాత నటుడు నాస్లెన్ మరొక చిత్రంతో తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నాడు. నటుడు ఈసారి 'అలప్పుజా జింఖానా' అనే స్పోర్ట్స్ డ్రామాలో నటిస్తున్నాడు. ఖలీద్ రెహ్మాన్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం ఇప్పుడు ఏప్రిల్ 25, 2025న తెలుగు విడుదల కోసం సిద్ధమవుతోంది. అలప్పుజా జింఖానాను మొదట ఏప్రిల్ 10, 2025న మలయాళంలో విడుదల చేశారు మరియు దాని కంటెంట్-ఆధారిత కథ చెప్పడం మరియు క్రీడా శైలిని రిఫ్రెష్ చేసినందుకు సానుకూల స్పందన వచ్చింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద స్థిరంగా ఉంది మరియు ఇప్పుడు తెలుగు ప్రేక్షకులని అలరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చిత్రంలో లుక్మన్ అవరాన్, గణపతి ఎస్, సందీప్ ప్రదీప్, అనఘా రవి, ఫ్రాంకో ఫ్రాన్సిస్, బేబీ జీన్, శివ హరిహరన్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. ప్లాన్ బి మోషన్ పిక్చర్స్ మరియు రీలిస్టిక్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం సంగీతాన్ని విష్ణు విజయ్ స్వరపరిచారు.

# అర్జున్ S/O వైజయంతి రివ్యూ

కళ్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి కీలక పాత్రలో తెరకెక్కిన సినిమా అర్జున్ సన్నాఫ్ వైజయంతి. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ పై ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. నేడు ఏప్రిల్ 18 ఈ సినిమా థియేటర్స్ లో రిలీజయింది.వైజయంతి(విజయశాంతి) ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్. అతని కొడుకు అర్జున్(కళ్యాణ్ రామ్)ని పోలీస్ ఆఫీసర్ గా చూడాలనుకుంటుంది. కానీ తన తండ్రిని చంపినవాళ్ళల్లో ఒకరిని అర్జున్ హత్య చేస్తాడు. దీంతో తల్లే అర్జున్ పై హత్య కేసు పెట్టి దూరమవుతుంది. ఆ కేసు నడుస్తుండగానే అర్జున్ వైజాగ్ నే తన కంట్రోల్ తెచ్చుకొని ఒక రౌడీగా ఎదుగుతాడు. వైజాగ్ లోని ఓ జాలరి పేటలో తన భార్యతో కలిసి ఉంటాడు అర్జున్. తల్లి తనని దూరం పెట్టినా అర్జున్ తల్లిని చూడాలని, కలవాలని, మాట్లాడాలని అనుకుంటూ ఉంటాడు. అర్జున్ భార్య చిత్ర(సయీ మంజ్రేకర్) ప్రెగ్నెంట్ అయిన సమయంలో తన తల్లి వైజయంతి పై అటాక్ జరుగుతుంది. అసలు వైజయంతి పై అటాక్ చేసింది ఎవరు? తల్లి కొడుకులు విడిపోవడానికి అసలు కారణం ఏంటి? అర్జున్ ఎందుకు హత్య చేస్తాడు? అర్జున్ జాలరి పేటలో ఎందుకు ఉంటాడు? అర్జున్ రౌడీగా మారడానికి కారణం ఏంటి? అర్జున్ – వైజయంతి మళ్ళీ కలిసారా? అర్జున్ తన తల్లిని ఎలా కాపాడుకున్నాడు తెలియాలంటే తెరపై చూడాల్సిందే. కొడుకు ఏదో తప్పు చేస్తే తండ్రి లేదా తల్లి దూరం పెట్టడం, అతను చేసింది రైట్ అని చివర్లో తెలియడం.. ఇలాంటి లైన్ తో గతంలో చాలా సినిమాలు వచ్చాయి. అర్జున్ సన్నాఫ్ వైజయంతి కూడా ఇదే కథతో తల్లి వర్సెస్ కొడుకుగా సాగుతూనే సెంటిమెంట్ తో నడుస్తుంది. ఫస్ట్ హాఫ్ అంతా అర్జున్ వర్సెస్ వైజయంతి అని, ఇద్దరూ మాట్లాడుకోవట్లేదు అని చూపించి ఎందుకు అని ఒక ఆసక్తి నెలకొల్పుతారు. ఫస్ట్ హాఫ్ రొటీన్ కమర్షియల్ సినిమాల లాగే ఉంటుంది. ఇక సెకండ్ హాఫ్ ముందు ఓ ట్విస్ట్ ఇచ్చి అసలు ఫైట్ వేరు అని ఇంట్రెస్ట్ నెలకొల్పుతారు. సెకండ్ హాఫ్ లో ఫ్లాష్ బ్యాక్ చెప్పి కథలో వదిలేసిన చాలా పాయింట్స్ కి లింక్ కలుపుతారు. దీంతో సెకండ్ హాఫ్ బాగానే వర్కౌట్ అయింది. క్లైమాక్స్ అయితే సాగదీశారు. సినిమా అంతా హీరో తల్లి కోసం ఏం చేసాడు, తల్లిని కాపాడుకోవడానికి ఏం చేసాడు అనే సాగుతుంది. అయితే క్లైమాక్స్ లో తన తల్లిని కాపాడుకోవడానికి హీరో చేసే ఓ పని అందరికి షాక్ ఇస్తుంది. అసలు ఇలాంటి ఆలోచన డైరెక్టర్ కి ఎలా వచ్చింది అని ఆశ్చర్యపోతారు. తల్లి సెంటిమెంట్ వర్కౌట్ అయినా చాలా వరకు రొటీన్ కమర్షియల్ సినిమాలాగే అనిపిస్తుంది. సినిమాల్లో లాజిక్స్ వెతక్కూడదు కానీ లాజిక్ లెస్ సీన్స్ చాలానే ఉంటాయి. యాక్షన్ సీన్స్ మాత్రం భారీగా డిజైన్ చేసారు. కళ్యాణ్ రామ్, విజయశాంతిలకు ఎలివేషన్స్ కూడా భారీగానే ఇచ్చారు. కళ్యాణ్ రామ్ రొటీన్ కమర్షియల్ పాత్రలో బాగానే చేసినా క్లైమాక్స్ లో మాత్రం అదరగొట్టాడు. ఆ క్లైమాక్స్ కి కళ్యాణ్ రామ్ ఒప్పుకున్నాడు అంటే సాహసం అనే చెప్పొచ్చు. ఒకప్పుడు పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలతో మెప్పించిన విజయశాంతి చాన్నాళ్ల తర్వాత మళ్ళీ పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా అదరగొట్టింది. ఈ ఏజ్ లో కూడా భారీ యాక్షన్స్ చేసి మెప్పించింది. హీరోయిన్ సయీ మంజ్రేకర్ పాత్రకు అసలు స్కోప్ లేదు. ఆ పాత్ర లేకపోయినా కథ నడుస్తుంది. శ్రీకాంత్ పోలీస్ పాత్రలో బాగానే మెప్పించాడు. బబ్లూ పృథ్వీరాజ్ కి మంచి పాత్ర పడింది. బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్ నెగిటివ్ షేడ్స్ లో ఓకే అనిపించాడు. మిగిలిన నటీనటులు వారి పాత్రల్లో మెప్పించారు. సినిమాటోగ్రఫీ విజువల్స్ ఓకే అనిపిస్తాయి. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మాత్రం బాగా కొట్టారు. పాటలు ఒక్కసారి వినొచ్చు. రెగ్యులర్ కథని కొత్త స్క్రీన్ ప్లేతో కొత్త క్లైమాక్స్ తో చెప్పడానికి ప్రయత్నించాడు దర్శకుడు. నిర్మాణ పరంగా ఈ సినిమాకు బాగానే ఖర్చుపెట్టారు అనిపిస్తుంది. మొత్తంగా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' తల్లి కొడుకు సెంటిమెంట్ తో సాగే రెగ్యులర్ కమర్షియల్ యాక్షన్ సినిమా.







# పెళ్లయ్యాక ఘాటు పెంచిందే

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్ గ్రాఫ్ ప్రస్తుతం పూర్తిగా పడిపోయింది. ఇక రీసెంట్‌గా పెళ్లి కూడా చేసుకోవడంతో కెరీర్‌కి ఎక్కడ ఫుల్ స్టాప్ పెట్టేస్తుందోనని ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. కానీ రకుల్ లుక్ చూస్తుంటే సెకండ్ ఇన్నింగ్స్ షురూ చేసేలా ఉంది. గత నెలలోనే తన ప్రియుడు జాకీ భగ్నానీని పెళ్లి చేసుకుంది రకుల్ ప్రీత్ సింగ్. పెళ్లయి నెల రోజులు కూడా కాకుండానే తన కెరీర్‌పై కాన్సట్రే-షన్ చేస్తుంది రకుల్. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫొటోలు చూసి నెటి-జన్లు అవాక్కవుతున్నారు. రెడ్ హాట్ మిర్చిలా రకుల్ కనిపించేసరికి ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.



# ప్రియాంకా చోప్రాకు నమ్రతా శిరోద్కర్ థాంక్స్

మహేశ్‌బాబు భార్య నమ్రత శిరోద్కర్ ప్రియాంక చోప్రాకు థ్యాంక్స్ చెప్పారు. నమ్రత కుటుంబంతో కలిసి ఇటీవల ఇటలీలో పర్యటించారు. ఈ క్రమంలో ప్రియాంక రోమ్‌లో 'ది లాస్ట్ ఫైవ్ ఇయర్స్' షోను నమత్ర కోసం ప్రత్యేకంగా ప్రదర్శింప జేశారు. షోలో ప్రియాంక భర్త నిక్ జొనాస్ పెర్ఫామ్ చేశారు. దీంతో ప్రియాంకా చోప్రాకు నమత్ర కృతజ్ఞతలు తెలిపారు.మహేశ్ బాబు హీరోగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' (SSMB 29)లో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఒడిశాలో జరిగిన చిత్రీకరణలో ఆమె పాల్గొన్నారు. త్వరలో కొత్త షెడ్యూల్ షూటింగ్ జరగనుంది.

# అభిషేక్, నితీశ్‌కు బీసీసీఐ కాంట్రాక్టు!

భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి, బౌలర్ హర్షిత్ రాణాకు బంపరాఫర్ దక్కనుంది. ఈ ముగ్గురూ ఈ ఏడాది బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు అందుకోనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఒక ఏడాదికాలంలో ఒక క్రికెటర్ మూడు టెస్టులు లేదా 8 వన్డేలు లేదా పది టీ20లు ఆడితే వాళ్లు నేరుగా గ్రేడ్- సీ కాంట్రాక్టును అందుకునే అవకాశముంది. దీని ప్రకారం చూసుకున్నా.. అభిషేక్ ఇప్పటిదాకా 17 టీ20లు ఆడగా అందులో నిరుటి సీజన్‌లో వరుసగా 12 మ్యాచ్‌లు ఆడాడు. నితీశ్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టులలోనూ ఆడి అంచనాలకు మించి రాణించాడు. హర్షిత్ ఈ క్రైటీరియాలో తగిన మ్యాచ్‌లు ఆడకపోయినప్పటికీ అతడికీ కాంట్రాక్టు దక్కనున్నట్టు తెలుస్తున్నది. వీరితో పాటు టీ20లలో తనదైన బౌలింగ్‌తో రాణిస్తున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (4 వన్డేలు, 18 టీ20లు) కూడా బీసీసీఐ కాంట్రాక్ట్ లిస్ట్‌లో చోటు దక్కించుకోనున్నట్టు సమాచారం. త్వరలోనే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవనున్నాయి.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# ట్రంప్‌తో ఇటలీ ప్రధాని భేటీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా 70కిపైగా దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించారు. పెంచిన సుంకాలు త్వరలో అమల్లోకి రానున్నాయి. ట్రంప్ టారిఫ్‌లతో ఆయా దేశాలు సతమతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యంతో చర్చలకు సిద్ధమవుతున్నాయి. తాజాగా ఇటలీ ప్రధాని మెలోనీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వాణిజ్య ఒప్పందం అంశంపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం టారిఫ్‌లతో ఆదాయం వస్తోందన్నారు. టారిఫ్ డీల్ విషయంలో తాను తొందర పడటం లేదని వ్యాఖ్యానించారు. ఆ ఒప్పందాలు ఓ నిర్దిష్ట సమయంలో జరుగుతాయన్నారు. ఈయూ, ఇతర దేశాలతో డీల్స్ చేసుకోవడం చాలా సులువే అని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంలో వంద శాతం ఒప్పందం జరుగుతుందని హామీ ఇచ్చారు. సుంకాల ప్రకటన తర్వాత ట్రంప్‌తో డైరెక్ట్‌గా చర్చలు జరిపిన తొలి ఐరోపా దేశ నేతగా మెలోనీ నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశ్చిమాన్ని గొప్పగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఏప్రిల్ 2న భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ ప్రతీకార సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఐరోపా నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం టారిఫ్‌లు విధించారు. ఆ తర్వాత పెంచిన టారిఫ్‌ల అమలును 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పలు దేశాలు టారిఫ్‌ల విషయంపై చర్చలు జరిపేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

# పూణె-బెంగళూరు హైవేపై వోల్వో బస్సు దగ్ధం

మహారాష్ట్రలోని పూణె జిల్లా పరిధిలో ఘోర ప్రమాదం జరిగింది. పూణె నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ వోల్వో బస్సు హైవేపై కాలిపోయింది. బస్సు ఖేడ్ శివపూర్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు గమనించి వెంటనే కిందికి దిగేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.అయితే వేసవిలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటా యి. ముఖ్యంగా వాహనాలు ఉన్నట్టుండి మంటల్లో కాలిపో యిన ఘటనలు ఎన్నో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాహనదారులు వేసవిలో కాస్త జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మండు వేసవిలో మధ్యాహ్నం పూట ప్రయాణాలు చేయక పోవడమే ఉత్తమమని చెబుతున్నారు.






## అమెరికా పౌరులను ఎల్ సాల్వడార్ జైళ్లకు
# పంపే యోచనలో ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక ప్రతిపాదన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా పౌరులైన కొందరు తీవ్ర నేరస్థులను విచారణ అనంతరం మధ్య అమెరికా దేశమైన ఎల్ సాల్వడార్‌లోని జైళ్లకు పంపే ఆలోచనను ట్రంప్ యంత్రాంగం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనపై రాజ్యాంగ నిపుణుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.ఎల్ సాల్వడార్ అధ్యక్షుడు నయీబ్ బుకెలేతో జరిగిన సంభాషణలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. అమెరికాలో జైళ్ల స్థలానికి కొరత ఉందని, "స్వదేశీ నేరగాళ్లను" ఎల్ సాల్వడార్‌లోని అతిపెద్ద జైలు CECOTకు పంపే అవకాశం గురించి మాట్లాడినట్లు తెలిసింది. అయితే, ఇది చట్టబద్ధమైతేనే ముందుకు వెళ్తామని ట్రంప్ స్పష్టం చేశారు. అత్యంత క్రూరమైన, పదే పదే నేరాలకు పాల్పడే అమెరికన్లను మాత్రమే, అదీ చట్టం అనుమతిస్తేనే, ఈ విధంగా పంపే విషయాన్ని పరిగణిస్తామని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు.

# పోలీసుస్టేషన్‌కు బేడీలు వెయ్యడం ఏంటి విడ్డురం

దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు సీఐ బేడీలు వేసి చరిత్ర సృష్టించారని వైయస్ఆర్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మండిపడ్డారు. వైయస్ఆర్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటి కృష్ణవేణిని అరెస్టు చేసి దాచేపల్లి స్టేషన్‌కు తరలించగా, ఆమె కోసం స్టేషన్‌కు వెళ్లిన వైయస్ఆర్‌సీపీ నేతలను అడ్డుకునేందుకు సీఐ పోలీస్ స్టేషన్‌కు బేడీలు వేసిన తీరును మహేష్‌రెడ్డి తీవ్రంగా తప్పపట్టారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశం మీడియాకు విడుదల చేశారు. అయన మాట్లాడుతూ.... ఈ ప్రెస్‌మీట్ పెడుతున్నందుకు నవ్వాలో, ఏడ్వాలో అర్థం కావడం లేదు. ఒక పల్నాడు బిడ్డగా సిగ్గుతో తల దించుకోవాలో దిక్కు తోచడం లేదు. టీడీపీ కూటమి పాలనలో పల్నాడు జిల్లాలో చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి. దాచేపల్లి పోలీసుల చర్యలు వింతగా ఉన్నాయి. నిన్న రాత్రి సోషల్ మీడియా యాక్టివిస్టు కృష్ణవేణిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎందుకు అరెస్టు చేశారో తెలుసుకునేందుకు వైయస్ఆర్‌సీపీ నాయకులు ఆ పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లారు. మా పార్టీ నాయకులు వెళ్లే సరికి పోలీస్ స్టేషన్‌కు తలుపులు వేశారు. ఆ తలుపులకు బేడీలు వేసి దాచేపల్లి పోలీసులు మహిళా కార్యకర్తను దాచారు. శిక్షపడినప్పుడు ముద్దాయిలకు బేడీలు వేసిన ఘటనలు చూశాం కానీ, పోలీసులే, వాళ్ల పోలీసు స్టేషన్‌కే బేడీలు వేయడమన్నది దేశ చరిత్రలో ఇదే మొట్టమొదటి సారి వినడం, చూడటం కూడా. ఇంత కన్నా సిగ్గుచేటు అధికారులకు, ఈ ప్రభుత్వానికి ఉంటుందా?. ఇలాంటి చర్యల పట్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా ఆలోచించాలి.ఇంత గొప్ప పని చేసిన దాచేపల్లి సీఐ చరిత్రను ఇటీవలే వైయస్ జగన్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అతనిపై అన్ని రకాల ఎంక్వైరీలు ఉంటాయి. ఇప్పటికే ఆ సీఐ వైయస్ఆర్‌సీపీకి చెందిన నలుగురు, ఐదుగురు కార్యకర్తలను కొట్టాడు. హై కోర్టులో అతనిపై కేసు వేశాం.





## కత్తితో బెదిరించి విమానం
# హైజాక్‌కు యత్నం..
### నిందితుడిపై ప్రయాణికుడి కాల్పులు

అమెరికాలోని బెలిజ్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడు హైజాక్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే, తోటి ప్రయాణికుడు కాల్పులు జరపడంతో నిందితుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. న్యూయార్క్ పోస్ట్ నివేదిక ప్రకారం.. ట్రాపిక్ ఎయిర్‌కు చెందిన ఓ చిన్న విమానం గురువారం కొరొజాల్ నుంచి శాన్ పెడ్రోకు వెళ్తోంది. విమానం కొరొజాల్ ఎయిర్‌పోర్ట్‌లో టేకాఫ్ తీసుకుంది. విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికి అందులోని ఓ ప్రయాణికుడు కత్తితో ప్రయాణికులకు బెదిరించాడు. విమానం హైజాక్ చేసేందుకు ప్రయత్నించాడు. కొందరు ప్రయాణికుల్ని గాయపరిచాడు కూడా. అతడి చర్యకు ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇంతలో ఓ ప్రయాణికుడు తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో నిందితుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో విమానంలో 14 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నట్లు న్యూయార్క్ పోస్ట్ నివేదించింది. నిందితుడిని అమెరికా పౌరుడు 49 ఏళ్ల అకిన్యేలా సావా టేలర్‌గా గుర్తించారు.




# శబరిమల అయ్యప్పను దర్శించుకున్న నటులు కార్తి, జయం

తమిళ నటులు కార్తి, జయం రవి శబరిమలలో కొలువైన అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అయ్యప్ప మాల వేసుకున్న కార్తి, జయం రవిలు గురువారం రాత్రి ఇరుముడితో శబరిమలకి వెళ్లి మణికంఠుడిని దర్శించుకున్నారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. దర్శనసంతరం కార్తి మాట్లాడుతూ.. తాను తొలిసారి స్వామి మాల వేసుకుని శబరిమలకి వచ్చానని.. ఈ అనుభవం తనకు మానసిక శాంతిని, బలాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. కన్నె స్వామి(అయ్యప్ప మాల మొదటిసారి వేసుకున్నవారు)గా ఇక్కడికి రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. పవళింపు సేవలో స్వామి వారిని దర్శించుకోవడం ఒక ప్రత్యేకమైన అనుభూతినిచ్చింది. భవిష్యత్తులో కూడా స్వామి వారి దర్శనానికి రావాలని కోరుకుంటున్నాను అని కార్తి మీడియాతో అన్నారు. జయం రవి మాట్లాడుతూ.. తాను ఇదివరకే చాలాసార్లు శబరిమల ఆలయాన్ని సందర్శించానని తెలిపారు. "నేను 2015 నుండి ఇక్కడికి వస్తున్నాను. ఇప్పటివరకు దాదాపు తొమ్మిదిసార్లు శబరిమలను దర్శించుకున్నాను. స్వామిపై నాకు ఎంతో నమ్మకం ఉంది. నా జీవితంలో చాలా మంచి జరిగిందని తెలిపారు.

# నేడు పంజాబ్ vs ఆర్‌సీబీ

ఐపీఎల్ 2025లో ఈ రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ పంజాబ్ కింగ్స్ మధ్య ఓ కీలక మ్యాచ్ జరగనుంది. పాయింట్ల పట్టికలో సత్తా చాటాలనే ఉద్దేశ్యంతో ఇరుజట్లు బరిలోకి దిగనున్నాయి. కాబట్టి, ఈ మ్యాచ్ రెండు జట్లకు ఎంతో కీలకమైనది. ఈ సీజన్‌లో ఆర్సీబీ బయట మ్యాచ్‌లను నిలకడగా గెలిచింది. కానీ, సొంత మైదానంలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలైంది. పంజాబ్‌తో అది కూడా సొంత మైదానంలో హ్యాట్రిక్ పరాజయాల నుంచి తప్పకోవాలని చూస్తోంది. గత మ్యాచ్‌లో అత్యల్ప స్కోరును డిఫెండ్ చేసిన జట్టుగా పంజాబ్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. రెండు జట్లలో ఆడే ప్రాబబుల్ ప్లేయింగ్ 11లో ఎవరు ఉండవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఓపెనింగ్ జోడీ ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లి జట్టుకు నిలకడగా గొప్ప ఆరంభాన్ని అందిస్తున్నారు. గత మ్యాచ్‌లో వీరు అద్భుతంగా ఆడారు. జట్టులో ఎటువంటి మార్పు జరుగుతుందనే ఆశ లేదు. ఈ సీజన్‌లో కోహ్లి గొప్ప ఫామ్‌లో ఉన్నాడు. జట్టు కోహ్లి నుంచి మరో భారీ ఇన్నింగ్స్‌ను ఆశిస్తోంది. లియామ్ లివింగ్‌స్టోన్ బ్యాటింగ్ ఖచ్చితంగా ఆందోళన కలిగించే




విషయమే. కానీ, అతను బంతితో మంచి సహకారం అందించగలడు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రాబబుల్ ప్లేయింగ్ XI: ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లి, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ (కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, యశ్ దయాల్, సుయాష్ శర్మ.

పంజాబ్ కింగ్స్: యువ ప్రియాంష్ ఆర్య, ప్రభ్ సిమ్రాన్ సింగ్ ఓపెనింగ్ జోడీ నుంచి పంజాబ్ మరోసారి దూకుడు ఆరంభం ఆశిస్తోంది. ఈ ఇద్దరు బ్యాటర్లకు చిన్నస్వామి మైదానం అనుకూలంగా ఉండవచ్చు. గ్లెన్ మాక్స్‌వెల్ నిరంతరం విఫలమవుతున్నాడు.

చిన్నస్వామిలో స్పిన్నర్లకు పెద్దగా సహాయం లభించకపోవడంతో, అతని స్థానంలో మార్కస్ స్టోయినిస్‌కు అవకాశం ఇవ్వవచ్చు. జేవియర్ బార్ట్‌లెట్ తన ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కాబట్టి, అతని స్థానం కూడా సేఫ్. అయితే, అందరి దృష్టి యుజ్వేంద్ర చాహల్ పైనే ఉంటుంది. అతను తన పాత ఫ్రాంచైజీ బెంగళూరుకు వ్యతిరేకంగా ఆడుతున్నాడు.

పంజాబ్ కింగ్స్ ప్రాబబుల్ ప్లేయింగ్ XI: ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), జోష్ ఇంగ్లిస్, నెహాల్ వధేరా, మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్, మార్కో జాన్సన్, యుజ్వేంద్ర చాహల్, జేవియర్ బార్ట్‌లెట్, అర్ష్‌దీప్ సింగ్, సుయాన్ష్ షెడ్జ్.

## లిక్కర్ స్కామ్ కేసులో సిట్ దూకుడు..
# ఇవాళ విచారణకు విజయసాయి రెడ్డి

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. కేసులో కీలక సూత్రధారులుగా భావించిన వారికి నోటీసులు ఇచ్చి వరుసగా విచారణకు పిలుస్తున్నారు. ఈ క్రమంలోనే సాక్షిగా ఇవాళ విచారణకు హాజరుకావాలని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి ఈనెల 15న సిట్ నోటీసులు జారీ చేసింది. అయితే 17వ తేదీనే సిట్ విచారణకు హాజరవుతానన్న విజయసాయి రెడ్డి..చివరి నిమిషంలో డుమ్మా కొట్టారు. ఈ రోజు విచారణకు వస్తానంటూ మరోసారి సిట్‌కి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆయన సిట్ ముందు విచారణకు హాజరుకానున్నారు. మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ ..అన్నీ రాజ్ కసిరెడ్డేనని ఇంతకుముందు విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించినట్టు తెలుస్తుంది. దీంతో విజయసాయిరెడ్డిని సాక్షిగా విచారణకు పిలిచింది సిట్. సిట్ నోటీసులపై స్పందించిన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఒకరోజు ముందగానే విచారణకు హాజరవుతున్నట్టు నిన్న సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ముందే నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటంతో 18న విచారణకు వచ్చేందుకు కుదరదని..కావున ఇవాళే(17వతేదీనే) విచారణకు వస్తున్నట్టు సిట్ అధికారులకు తెలిపారు. కానీ చెప్పినట్టుగా ఆయన నిన్న (17న) విచారణకు హాజరుకాలేదు. ఇవాళ విచారణకు హాజరవుతానని మరోసారి సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇవాళ సిట్ అధికారులు ఆయనను విచారించనున్నారు. సిట్ విచారణలో ఆయన ఏం చెబుతారు. ఎలాంటి సంచలన విషయాలు బయటపెడతారోననే ఉత్కంఠ నెలకొంది.

## 'కేసరి 2' ఇంట్రో మిస్ అవ్వకండి..
# అభిమానులకు అక్షయ్ రిక్వెస్ట్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కేసరి చాప్టర్ 2'. అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్ వాలాబాగ్ అనేది ట్యాగ్‌లైన్. మాధవన్, రెజీనా కసాండ్రా, అనన్య పాండే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు కరణ్ సింగ్ త్యాగీ దర్శకత్వం వహిస్తుండగా.. ధర్మ ప్రొడక్షన్ బ్యానర్‌పై కరణ్ జోహార్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సమ్మర్ కానుకగా ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమాకు సంబంధించి అభిమానులకు ఒక రిక్వెస్ట్ చేశాడు అక్షయ్ కుమార్. ఈ సినిమా చూసేవారు ఇంట్రో మిస్ అవ్వకండంటూ తెలిపాడు. ఈ సినిమా చూడటానికి వచ్చే వారందరికీ నా విజ్ఞప్తి ఏమిటంటే.. దయచేసి 'కేసరి 2' ఇంట్రో మిస్ అవ్వకండి. ఈ సినిమాలోని మొదటి 10 నిమిషాలు చాలా ముఖ్యమైనవి. మీ కెమెరా ద్వారా ఇది ప్రతి ఒక్కరికీ చేరుతుందని నాకు నమ్మకం ఉంది. ఈ సినిమా చూడాలని నిర్ణయించుకున్నవారు ఆలస్యంగా రాకూడదని తెలుసుకోవాలి. సరైన సమయంలో రావాలి. ఈ సినిమా యొక్క కథ ఆ 10 నిమిషాలు నుంచే ప్రారంభమవుతుందంటూ అక్షయ్ చెప్పకోచ్చాడు.

